తుక్కుగా అమ్మకానికి సాంచాలు

- సంక్షోభంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ
- అరకొర ఆర్డర్లతో సర్కారు సవతి ప్రేమ
- ఇప్పటికీ అమలుకాని సర్కారు హామీలు
- వలస బాటలో చేనేత కార్మికులు

రాజన్న సిరిసిల్ల, జూన్ 13 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల సాంచాలకు సావొచ్చింది. వస్త్రాల ఉత్పత్తితో ఏడాది పొడవునా ఉపాధి కల్పిస్తానన్న మంత్రి పొన్నం హామీ అటకెక్కింది. కరుణించని సర్కారుతో బతుకు మారక నేతన్న ఉపాధికి మళ్లీ వలస బాటపట్టాల్సి వస్తున్నది. ఆర్డర్లు లేక ఇప్పటికే 500 సాంచాలను తుక్కుగా అమ్మేశారు. సంక్షోభంలోకి కూరుకుపోతున్న వస్త్ర పరిశ్రమతో సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్ల అవుతుందా..? అన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

ఇనుప సామాను కింద సాంచాలు

కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరల ఆర్డర్లతో జరిపోగలై మెరిసిన సాంచాలు కాంగ్రెస్ పాలనలో ఇనుప సామాన్లకు అమ్ముకునే దుస్థితి వచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉరిసిల్లగా మారిన సిరిసిల్లకు కేసీఆర్ ప్రభుత్వం చేయూతనిచ్చింది. నేతన్నల తలరాతలు మార్చింది. సర్కారు చేయూతతో ఆత్మహత్యలు, ఆకలిచావులు లేకుండా చేసింది. పదేండ్లలో ఏటా రూ.350 కోట్ల వస్త్ర ఆర్డర్లతో చేతి నిండా పని కల్పించారు. థ్రిఫ్ట్, బీమా, యార్న్ సబ్సిడీ వంటి పథకాల అమలుతో నేతన్నలు గౌరవంగా బతికారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే బతుకమ్మ చీరల ఆర్డర్లు నిలిపివేసింది. దీంతో నేతన్నలు మళ్లీ రోడ్డున పడ్డారు. సిరిసిల్లలోని 30 వేల సాంచాలు మూలనపడ్డాయి. గత సర్కారు కన్నా మెరుగైన వస్త్ర ఉత్పత్తులతో ఏడాది పొడవునా పని కల్పిస్తామని పార్లమెంటు ఎన్నికల ముందు రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సిరిసిల్లలో ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఆర్డర్లు ఇవ్వలేకపోయామని చెప్పుకొచ్చారు. కానీ, ఇచ్చిన హామీ నేటి వరకు అమలు కాలేదు.

అరకొర ఆర్డర్లు

రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలపై సవతి ప్రేమ చూపుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్డర్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం రూ.34 లక్షల విలువగల సర్వశిక్ష అభియాన్ వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంది. ఇచ్చిన ఆర్డర్లతో వెయ్యి మందికి కూడా ఉపాధి లభించలేదని కార్మిక వర్గాలు చెబుతున్నాయి. ఆర్టీసీ, సింగరేణి ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన వస్త్ర ఆర్డర్లు సిరిసిల్లకే ఇస్తామని చెప్పి ఊసెత్తడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నేతన్నలు పనిలేక, కుటుంబ పోషణ భారమై భీవండి, సూరత్‌కు వలస బాటపడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం సాంచాలకు కరెంటు కోసం యూనిట్‌కు రెండు రూపాయల సబ్సిడీ ఇచ్చింది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం యూనిట్‌కు రూ.8.50లు వసూలు చేస్తూ ఆసాములపై పెను భారం మోపింది. కరెంటు బిల్లులు చెల్లించలేక ఆసాములు సాంచాలు పగులగొట్టి స్క్రాప్‌కు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. ఇప్పటికే 500ల సాంచాలు తుక్కు కింద అమ్ముకున్నారు. వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు రూ.350 కోట్లలో రూ.150 కోట్లు మాత్రమే విడుదల చేసింది. కార్మికులకు రావాల్సిన నూలు సబ్సిడీ పైసలూ ఇవ్వలేదు. గత ప్రభుత్వ పథకాలన్నీ నిలిపివేయడంతో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం వస్త్ర ఆర్డర్లు ఇచ్చి అండగా నిలువాలని కార్మికులు కోరుతున్నారు.

ఇచ్చిన హామీలు అమలు చెయ్యాలి

మెరుగైన వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లతో ఏడాది పొడవునా పనికల్పిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీ అమలు చెయ్యాలి. పదికోట్ల మీటర్ల వస్త్ర ఆర్డర్లు ఇస్తే తప్ప సాంచాలు నడవని పరిస్థితి ఉంది. యజమానులకు, ఆసాములకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలి. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలి. వర్కర్ టు ఓనర్ పథకం వెంటనే ప్రారంభించి కార్మికులకు ఉపాధి కల్పించాలి. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్ల అయ్యే ప్రమాదం ఉంది.

– మూషం రమేశ్, రాష్ట్ర అధ్యక్షుడు
తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్

లోకం పోకడ



రుణమాఫీ కొందరికే!

ఆరు గ్యారెంటీలకు నిధులెలా?

- రైతు రుణమాఫీకి మరో రెండు నెలలే గడువు
- రాష్ట్రంలో మొదలైన పూర్తి స్థాయి బడ్జెట్ కసరత్తు
- జూలై రెండు లేదా మూడో వారంలో పూర్తిస్థాయి బడ్జెట్

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీలను ఎలా అమలు చేయాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తర్జనభర్జన పడుతున్నది. ఆగస్టు 15లోగా రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయడానికి రెండు నెలల గడువే మిగిలింది. రుణమాఫీ కోసం రూ.30 వేల కోట్లకుపైగా నిధులు అవసరమని అంచనా. ఈలోగా నిధుల సమీకరణ పెను సవాలుగా మారింది. రుణమాఫీతోపాటు ఇతర హామీల అమలుకు అవసరమైన నిధులను సమీకరించడానికి ఆదాయ మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తున్నది. ఈ మేరకు ఇప్పటికే ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఆయా శాఖల మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సమావేశం కానున్నారు. ఈ నెల 18 నుంచి శాఖలవారీగా బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించనున్నారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత, రాష్ట్ర అసెంబ్లీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను జూలై రెండో వారం లేదా మూడో వారంలో ప్రవేశ పెట్టడం కోసం ఆర్థిక శాఖ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

బడ్జెట్ ప్రతిపాదనలపై షెడ్యూల్

- 18న అగ్రి, మార్కెటింగ్, సహకార, చేనేతశాఖల ప్రతిపాదనలపై చర్చ
- 21న రెవెన్యూ, గృహనిర్మాణం, ఐఅండ్‌పీఆర్, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమం, వైద్యారోగ్య శాఖ మంత్రులు, అధికారులతో సమావేశం
- 22న రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ, ఐటీ, పరిశ్రమల శాఖపై చర్చ
- 26న ఇరిగేషన్, పౌర సరఫరాలు, అటవీ, దేవాదాయ శాఖలపై సమావేశం
- 27న రవాణా, బీసీ సంక్షేమం, ఎక్సైజ్, పర్యాటక శాఖలపై చర్చ
- 28 నుంచి జూలై 1 వరకు సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ఉన్న పలు శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చ

మొదటిపేజీ తరువాయి...

నిధులను సమకూర్చుకోవడం, విధి విధానాలను రూపొందించడంపై దృష్టి సారించిన కాంగ్రెస్ ప్రభుత్వం 'అర్హుల' సంఖ్యను కుదించేందుకు మార్గాలను అన్వేషిస్తున్నట్టు తెలిసింది. కేంద్రం అమలుచేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం నిబంధనలను రైతు రుణమాఫీకి వర్తింపజేసేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. పీఎం కిసాన్ నిబంధనలను అడ్డంపెట్టుకుంటే దాదాపు 37 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సిన అవసరం ఉండదని భావిస్తున్నట్టు సమాచారం. పీఎం కిసాన్ పథకం ద్వారా కేంద్రం రైతులకు ఏటా రూ.6 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగులు, పన్ను చెల్లించే ప్రైవేటు ఉద్యోగులు, వ్యక్తులు, రాజ్యాంగబద్ధమైన పదువుల్లో ఉన్నవారికి ఈ పథకం వర్తించదు. ఈ షరతుల కారణంగా రాష్ట్రంలోని సగానికిపైగా రైతులకు పీఎం కిసాన్ సాయం అందడం లేదు. కేంద్రం ఇస్తున్నది చాలా చిన్న మొత్తం కావడం, ఆ ఆరువేలనే మూడు విడతలుగా ఇస్తుండటంతో నష్టపోతున్న రైతులు కూడా దానిని సీరియస్‌గా తీసుకోవడం లేదు. మరోవైపు, కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు ద్వారా ప్రతి సీజన్‌లో సుమారు 70 లక్షల మంది రైతులు తమకు ఉన్న మొత్తం వ్యవసాయ భూమికి పెట్టుబడి సాయం పొందుతున్నారు. కానీ, పీఎం కిసాన్ పథకం కింద 33 లక్షల మంది రైతులకే ఏడాదికి ఆరువేల చొప్పున పొందుతున్నారు. రైతుబంధును పొందుతున్నవారిలో 37 లక్షల మంది రైతులు పీఎం కిసాన్ పథకాన్ని పొందలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో రుణమాఫీకి పీఎం కిసాన్ నిబంధనలు అమలు చేస్తే రాష్ట్రంలోని సుమారు 37 లక్షల మందికి రుణమాఫీ కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భారం మోయలేక రైతులకు కోతలు

రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో అసలు ఎంతమంది రైతులకు, ఎంత మొత్తం రుణమాఫీ చేయాల్సి వస్తుందనే అంశంపై ప్రభుత్వం కసరత్తు చేసింది. రుణమాఫీకి సుమారు రూ.35 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వెల్లడించారు. ఆగస్టు 15లోగా రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి పలుమార్లు దేవుళ్ల మీద ఒట్టుపెట్టారు. అది కూడా మొత్తం రూ.2 లక్షల రుణాన్ని ఒకే దఫాలో మాఫీ చేస్తామని ప్రకటించారు. అయితే, రుణమాఫీకి అవసరమయ్యే నిధులను సమకూర్చుకోవడంలో విఫలమవుతున్న ప్రభుత్వం.. కోతలు విధించడం మీద దృష్టి సారించినట్టు తెలుస్తున్నది. ఏదో కొందరు రైతులకు మాత్రమే 'మమ' అనిపించి, రుణమాఫీ చేశామంటూ ప్రచారం చేసుకొనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది.

షరతులు లేకుండా కేసీఆర్ రుణమాఫీ

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండుసార్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.లక్ష వరకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేసింది. ఇలా 2014లో 35.31 లక్షల మంది రైతులకు చెందిన రూ.16,144 కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. ఆ తర్వాత 2018లో మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 23 లక్షల మంది రైతులకు చెందిన రూ. 13 వేల కోట్ల రుణాలను మాఫీ చేసింది. అయితే ఎన్నికల కోడ్ రావడం, ఇతర సమస్యలతో మరికొంత మందికి రుణమాఫీ చేయలేకపోయింది. ఈ విధంగా 2014, 2018లో మొత్తం 58 లక్షల మంది రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేసింది. ఇందుకోసం రూ.29,144 కోట్లను వెచ్చించింది. దీంతో ఆయా రైతులు బ్యాంకుల వద్ద తాకట్టుపెట్టిన పొలాలను విడిపించుకుని రుణ విముక్తులయ్యారు. గతంలో కేంద్రంలోని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వమైనా, ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వమైనా ఎటువంటి షరతులు లేకుండానే రైతులకు పంట రుణమాఫీ చేయడం విశేషం.



ఉత్తమ డాక్యుమెంటరీగా యూనిటీ ద మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్

భూదాన్‌పోచంపల్లి, జూన్ 13 : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలి దశ ఉద్యమ నేత, దివంగత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన 'యూనిటీ.. ద మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్' చిత్రం పగెంట్ అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ అవార్డులో ఉత్తమ డాక్యుమెంటరీ-2024గా ఎంపికైంది. ప్రపంచవ్యాప్తంగా 400కు పైగా చిత్రాలు రాగా, 38 చిత్రాలను అవార్డు క్యాటగిరీలో ఎంపిక చేసినట్టు ఈ డ్యాకుమెంటరీ నిర్మాత చిరందాస్ ధనంజయ తెలిపారు. జూలై 29 నుంచి ఆగస్టు 1 వరకు కొల్‌కతలోని స్టార్ థియేటర్ హాల్‌లో ఎంపికైన చిత్రాల ప్రదర్శన, అవార్డుల అందజేత ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ డాక్యుమెంటరీకి భూదాన్ పోచంపల్లికి చెందిన బడుగు విజయ కుమార్ దర్శకత్వం వహించారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	40.8°c	27.5°c
నల్లగొండ	38.0°c	24.0°c
మహబూబ్‌నగర్	37.6°c	28.2°c
నిజామాబాద్	37.1°c	25.7°c
వరంగల్	37.0°c	27.0°c
కరీంనగర్	37.0°c	27.0°c
మెదక్	36.5°c	22.8°c
రంగారెడ్డి	35.7°c	22.9°c
ఖమ్మం	34.0°c	26.0°c
హైదరాబాద్	33.7°c	23.7°c

సుప్రీం కోర్టు ఉత్తర్వులను పట్టించుకోరా?

వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడి నియామకంపై హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడి నియామకంపై సుప్రీంకోర్టు ఉత్తర్వులను గమనించలేదా అని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న వ్యక్తికి పరీక్ష అవసరంలేదని స్పష్టత ఇచ్చినా నియామకంలో జాప్యం ఎందుకు జరుగుతున్నదని నిలదీసింది. రాష్ట్ర వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడి పోస్టును భర్తీ చేయకపోవడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది బగ్లేకర్ ఆకాశ్‌కుమార్ వేసిన పిల్‌పై ఇటీవల ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. సుప్రీంకోర్టు తీర్పుపై వివరణ కోరుతూ పిటిషన్ దాఖలు చేశామని చెప్పారు. ఆ ఉత్తర్వులను పరిశీలించి వివరణ ఇస్తామని ప్రభుత్వ న్యాయవాది చెప్పడంతో విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది.

శాప్ ఎండీపై కోర్టు ధిక్కారం పిటిషన్

వాదనలు పూర్తి, తీర్పు వాయిదా

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): శాఖాపరమైన విచారణ పేరుతో 18 ఏండ్లుగా నిలిపివేసిన పెన్షన్ బకాయిలను చెల్లించాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడంపై స్పోర్ట్స్ అథారిటీ వీసీ, ఎండీ శైలజా రామయ్యర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. దీనిపై గురువారం న్యాయమూర్తి జస్టిస్ ఎస్ నంద విచారణ చేపట్టగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఓ ఉద్యోగికి రూ.4.48 లక్షల బకాయిలను చెల్లించాలని గత ఏడాది జూన్‌లో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినా అమలు చేయలేదని తెలిపారు. శాప్ తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ పెన్షన్ చెల్లించాల్సింది ప్రభుత్వమేనని, ప్రతివాదిగా ప్రభుత్వాన్ని చేర్చలేదని అన్నారు. ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చి గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పునఃపరిశీలించాలని రివ్యూ పిటిషన్ దాఖలు చేశామని చెప్పారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి తీర్పును వాయిదా వేశారు.

ఐదుగురి హత్యకేసులో ముగ్గురికి యావజ్జీవం

అంబర్‌పేట్ కేసులో హైకోర్టు తీర్పు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ఐదుగురిని హత్యచేసిన కేసులో దోషులుగా ఖరారైన ముగ్గురికి హైకోర్టు యావజ్జీవ శిక్షతోపాటు రూ.20 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. వారంతా నెలలో లొంగిపోవాలని ఆదేశించింది. అంబర్‌పేట్‌కు చెందిన దంపతులు ఖమరుద్దీన్, సాజిదాబేగం, వారి కుమారులు అబ్దుల్లా బియాబిని, కిర్మాణి, కూతురు నేహా ఆఫ్రిన్లను హత్యచేసిన కేసులో నేహా ఆఫ్రిన్ భర్త జహంగీర్, అతని సోదరుడు సయ్యద్ కరీం, వారి బావమరిది జబ్బార్ హుసేన్ దోషులుగా తేలారు. జహంగీర్‌కు, నేహా ఆఫ్రిన్లకు 2008లో పెండ్లి జరిగిన 3 నెలలకే వారు విడిపోయారు. నేహా ఆఫ్రిన్ తన భర్త అతని తల్లిదండ్రులపై వరకట్న వేధింపుల కేసు పెట్టారు. ఆ కేసు విచారణకు జహంగీర్, అతని తల్లిదండ్రులు కోర్టుకు హాజరై వెళుతుండగా రోడ్డు ప్రమాదం జరిగి జహంగీర్ తల్లి చనిపోయింది. దీంతో జహంగీర్, అతని కుటుంబసభ్యులు 2010 మే 30న దాడి చేసి నేహా ఆఫ్రిన్, ఆమె తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులను మారణాయుధాలతో హత్య చేశారు. ఈ ఘటనలో 9 మందిపై మృతుడి కోడలు కేసు పెట్టారు. ఎఫ్ఐఆర్‌లో ఇద్దరి పేర్లే ఉన్నాయంటూ కేసు కొట్టేసిన కిందికోర్టు మొత్తం తొమ్మిది మందిని నిర్దోషులుగా ప్రకటించింది. దీనిపై బాధితులు హైకోర్టును ఆశ్రయించగా.. విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం పోలీసుల దర్యాప్తులో లోపం పేరుతో నిందితులను వదిలిపెట్టడానికి వీల్లేదని, ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని గుర్తు చేసింది. ఎఫ్ఐఆర్ ఎన్‌సైక్లోపీడియా కాదని అభిప్రాయపడింది. ప్రధాన నిందితుడు జహంగీర్, అతని సోదరుడు, బావమరుదులకు యావజ్జీవ శిక్ష, రూ 20 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

ప్రపంచంలోనే పొట్టి జంట బ్రెజిల్‌కు చెందిన ద సిల్వ బ్రదర్స్, లై హోషినో

ప్రపంచంలోనే పొట్టి జంట

ప్రపంచంలోనే పొట్టి జంటగా బ్రెజిల్‌కు చెందిన పౌలో గాబ్రియెల్ ద సిల్వ బ్రదర్స్*(31)*, కట్యుసియా లై హోషినో*(28)* గిన్నిస్ రికార్డు సృష్టించారు. *2006*లో ఆన్‌లైన్ ద్వారా ఒకరికొకరు పరిచయమైన వీరిద్దరూ తర్వాత *15* ఏండ్ల పాటు ప్రేమించుకొని వివాహం చేసుకున్నారు. వీరిలో పౌలో ఎత్తు *90.28* సెంటీమీటర్లు కాగా, కట్యుసియా ఎత్తు *91.13* సెంటీమీటర్లు. గిన్నిస్ రికార్డు పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఈ దంపతులు.. తమ ఎత్తు తక్కువే అయినా మనసులు మాత్రం పెద్దవని, ఒకరినొకరం చాలా ప్రేమించుకుంటామని చెప్తున్నారు.

వాళ్లు అర్హులా? అనర్హులా..?

- గురుకుల నియామకాలపై తర్జనభర్జన
- విద్యార్హతల నిర్ధారణపై ట్రిబ్‌కు అస్పష్టత
- కోర్టుకు బాటనీ జేఎల్ అభ్యర్థులు
- అర్హతలపై విద్యామండలికి ట్రిబ్ లేఖ
- 3 నెలలుగా అభ్యర్థుల ఎదురుచూపులు

హైదరాబాద్, జూన్13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గురుకుల విద్య సంస్థ నియామక మండలి (ట్రిబ్) నోటిఫికేషనలో ఒకటి పేర్కొని, నియామక ప్రక్రియలో మరోవిధంగా నడుచుకొన్నదని అభ్యర్థులు మండిపడుతున్నారు. పలు పోస్టుల విద్యార్హతలకు సంబంధించి దేనిపైనా స్పష్టత ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికే పలువురు అభ్యర్థులు కోర్టును కూడా ఆశ్రయించారు. మరోవైపు బోర్డు మాత్రం అభ్యర్థులు లేవనెత్తిన ఆయా విద్యార్హతల అంశాలపై ఉన్నత విద్యామండలికి లేఖ రాసి చేతులు దులుపుకొన్నది. ఇప్పటివరకు దీనిపై ఎలాంటి స్పష్టత రాకపోవడంతో మూడు నెలలుగా సదరు అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు.

నోటిఫికేషన్‌కు విరుద్ధంగా జేఎల్ బాటనీ

ట్రిబ్ 160 బాటనీ జేఎల్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ సమయంలో ఆ పోస్టులకు బాటనీ తోపాటు బయోటెక్నాలజీ, మైక్రోబయోలజీ, మెరైన్ బయోలజీ, బయో సైన్స్, మాడ్రన్ బయోలజీ, ప్లాంట్ సైన్స్‌లో ఎమ్మెస్సీ చేసిన అభ్యర్థులు కూడా అర్హులని ట్రిబ్ పేర్కొన్నది. ఈ మేరకు జేఎల్ పోస్టులకు సంబంధించి 1:2 మెరిట్ జాబితాను విడుదల చేసింది. డెమోలకు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఆహ్వానించింది. ఎంఎస్సీతోపాటు డిగ్రీలో కూడా బాటనీ చదివి ఉండాలంటూ అనేక మంది అభ్యర్థులను కనీసం డెమోకు కూడా ట్రిబ్ అనుమతించలేదు. నోటిఫికేషన్‌కు విరుద్ధంగా మైక్రోబయోలజీ ఆంధ్రా యూనివర్సిటీ నుంచి చేసిన వారే జేఎల్ బాటనీకి అర్హులని కొంతమంది అభ్యర్థులను తిరస్కరించింది. అటు తరువాత తుది జాబితాను ప్రకటించింది. దీంతో బాధిత అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. అయితే వాదనలు విన్న అనంతరం నోటిఫికేషన్ ప్రకారం జేఎల్ బాటనీ పోస్టుకు యూనివర్సిటీతో సంబంధం లేకుండా మైక్రో బయోలజీ అభ్యర్థులు కూడా అర్హులని ఎంపిక చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ తీర్పు అనంతరం ఇదే తరహా అభ్యర్థనతో మరికొందరు కోర్టును ఆశ్రయించగా, అందుకు అవే ఉత్తర్వులు వర్తిస్తాయని కోర్టు వెల్లడించింది. ఇదే తరహాలో మరికొంత మంది సైతం వివిధ సబ్జెక్టులకు సంబంధించి ఇప్పటికే కోర్టును ఆశ్రయించారు. దాదాపు మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఈ విద్యార్థులకు సంబంధించి ట్రిబ్ ఎలాంటి స్పష్టతనివ్వలేదు. విద్యార్థులను తేల్చాలని కోరుతూ ఉన్నత విద్యామండలికి లేఖరాశామని, వారి మార్గదర్శకాల ప్రకారం ముందుకెళ్తామని ట్రిబ్ అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు ఈ అంశం ఎటూ తేలకపోవడంతో దాదాపు 3 నెలలుగా అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు. మరోవైపు ఆయా సొసైటీలు కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చే ప్రక్రియను చేపడుతున్న నేపథ్యంలో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వెంటనే ఈ అంశాన్ని తేల్చాలని ట్రిబ్‌ను డిమాండ్ చేస్తున్నారు.

ఈదురు గాలుల బీభత్సం

- పదుల సంఖ్యలో ధ్వంసమైన రేకుల ఇండ్లు
- పలు చోట్ల విరిగిపడ్డ స్తంభాలు, చెట్లు
- ఖమ్మం జిల్లాలో 68.8 మి.మీ. రికార్డు స్థాయి వర్షపాతం నమోదు

గురువారం జనగామలో కురుస్తున్న భారీ వర్షం

న్యూస్‌నెట్‌వర్క్, జూన్ 13 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పిడుగులు పడి బీభత్సం సృష్టించింది. గాలి దుమారానికి పదుల సంఖ్యలో రేకుల ఇండ్లు ధ్వంసమయ్యాయి. పలు చోట్ల విద్యుత్తు స్తంభాలు, చెట్లు విరిగిపడి విద్యుత్తు సరఫరాకు, ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ నగరంతోపాటు నర్సంపేటలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో ఓ మోస్తరు వాన పడింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల, వెంకటాపూర్ గ్రామాల్లో గాలిదుమారానికి భారీ నష్టం సంభవించింది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన పిడుగుల వర్షం కురిసింది. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం కడ్పల్ గ్రామంలో ఈదురు గాలుల బీభత్సానికి మూడు కరెంట్ స్తంభాలు నేలకూలాయి. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం రామాతీర్థం సబ్‌స్టేషన్‌లో పిడుగు పడింది. దీంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో పగుళ్లు వచ్చి కొంత ఆయిల్ లీకేజీ అయ్యింది. శివ్వంపేట మండలం లింగోజిగూడ దొంతి లక్ష్మయ్యకు చెందిన 5000 కోళ్ల సామర్థ్యం కలిగిన పౌల్ట్రీ ఫాం కుప్పకూలింది. అందులోని కోళ్లు, కోడిపిల్లలు మృత్యువాత పడ్డాయి. ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కొణిజర్ల మండలంలో రికార్డు స్థాయిలో 68.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బోనకల్ 53.3 మి.మీ., మధిర 52.8 మి.మీ, ఖమ్మం అర్బన్ 51.5 మి.మీ., చింతకాని 50 మి.మీ, రఘునాథపాలెం 46.8 మి.మీ, ఖమ్మం రూరల్ మండలంలో 26 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

మరో మూడు రోజులు వర్షాలు

తెలంగాణ-బంగాళాఖాతం మధ్య ఆవర్తన ద్రోణి: ఐఎండీ

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తెలంగాణ నుంచి బంగాళాఖాతం మధ్య ప్రాంతాల వరకు ఆవర్తన ద్రోణి కొనసాగుతున్నదని తెలిపారు. ఈ నెల 5న మహబూబ్‌నగర్ నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించిన రుతుపవనాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయని వెల్లడించింది. రాగల 24 గంటల్లో రాష్ట్రంలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందనిఅధికారులు పేర్కొన్నారు. కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, రంగారెడ